
**మనిషి ఎప్పుడూ చిన్న పిల్లాడిలా ఉంటే బాగుంటుంది. మనసు మంచు కొండలానే ఉంటుంది. పెరుగుతున్నకొద్దీ ఆ కొండ కరిగి పోతుంది. ఉత్త రాయి మాత్రం మిగులుతుంది!**



నాకు పదకొండేళ్ళు. అమ్మమ్మ ఆస్పత్రిలో చచ్చిపోయిందని పది గంటలకే తెలిసింది. అంతే, ఇంట్లో ఏదో సూపర్ సైక్లోన్ కాకపోయినా, కొంచెం అలాంటిదే ప్రారంభం అయింది. చెప్పానుగా నాకు పదకొండేళ్ళు. స్కూల్లో చదువుకుందుకు పెద్దవాణ్ణి. కానీ, ఇంట్లో సంగతులు తెలుసుకుందుకు కుర్రకుంకని! "అమ్మా ఏమైంది? అమ్మమ్మ చచ్చిపోతే తీసుకువెళ్ళడానికి రావేం" అని అడిగితే, "నోరు మూసుకు కూర్చోరా గోపీ. ఇది పెద్దల విషయం. పోయి కాస్సేపు కెమిస్ట్రీ చదువుకో. టెస్టు ఉందన్నావు కదూ. ఇంక అందరూ రావడం మొదలుపెడితే కూర్చుందుకు స్థలం ఉండదు" అని అతి రహస్యంగా హెచ్చరించింది అమ్మ. "రేపు స్కూలుకు వెళ్ళను" అన్నాను. ఒప్పుకోదని తెలుసు. అయినా, నా స్థాయికి తగ్గ ప్రయత్నం చేయాలి కదా. "ఇంట్లో కూర్చుని ఏం చేస్తావురా? అందరూ పిల్లాపాపలతో వచ్చేస్తారు. నీకేం పని ఉండదు" అంది. "అయితే, నీతో ఆస్పత్రికి వస్తాను. అమ్మమ్మని తీసుకు వస్తారు కదా."

"తప్పు. దానికి పెద్దాళ్ళంతా వెళ్తారు. మామయ్యలిద్దరూ రావాలి. అత్తలు వస్తారు. అమ్మమ్మ చెల్లెలు ఉంది కదా. అదే, నీకు చిన్నమ్మమ్మ. ఆవిడా రావాలి. పెద్దత్త రాకుండా ఏమైనా చేస్తే ఇంకేమైనా ఉందా? ఇల్లు పీకి పందిరి వేసేస్తుంది. అయినా, ఇవన్నీ నీకెందుకురా గోపీ. వెళ్ళి చదువుకోమన్నానా?" కసిరేసి పంపించేసింది అమ్మ.

కెమిస్ట్రీ నోట్సు - అదే గైడు పట్టుకొని పెరట్లోకి పోయాను. ఏం చదవ బుద్ధి కావడం లేదు. ఈ పెద్దవాళ్ళకు అసలు బుర్ర లేదునుకుంటా? ఓ పక్క అమ్మమ్మ చచ్చిపోయి ఆస్పత్రిలో పడి ఉంటే, ఇలా చదువుకో చదువుకో అంటూ ప్రాణాలు తోడుతుంది అమ్మ. ఎలా చదువుకోవడం? పాపం అమ్మమ్మ. కొన్ని రోజులుగా ఒంట్లో బాగుండలేదంతే. ముందే ఆస్పత్రిలో చేర్పించి ఉంటే బాగుండేదేమో. బతికేదేమో. వీళ్ళకు తోచదు. ఒక్కళ్ళూ నిర్ణయం తీసుకోరదేమిటో! పెద్ద మామయ్యనడగాలి. చిన్న మామయ్య ఏం అంటాడో... అత్తయ్యలకిష్టం ఉంటుందో లేదో... నాకర్థమవదు. ఓసారి నా కుక్క పడుకొని ఉంటే దాని కాలు మీద సైకిల్ చక్రం ఎక్కించేశాడెవడో వెధవ! అదేం జాతి కుక్క కాదు కానీ - నాది. నేనంటే ప్రాణం దానికి. అమ్మమ్మకూ అంతే. అమ్మమ్మ, "ఒరే నానీ, దాన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి కట్టు కట్టించరా. నోరు లేని జీవం. చెప్పుకోలేదు కదా దాని బాధ" అని నన్ను తరిమింది. కానీ, 'అమ్మమ్మ జబ్బుగా ఉంటే ఇంతమందిని సంప్రతించడం దేనికో' నాకు అర్థం కాలేదు.

పెరట్లో ఒకటీ అరా గడ్డిపరకలు పీకి కొరుకుతున్న నన్ను మా తోటవాడు పిలిచాడు. "మీ మామయ్య వచ్చాడు. నువ్విక్కడేం చేస్తున్నావు గోపీ" అనడిగాడు. "సూరన్నా మనం ఆ రోజు కుక్కను తీసుకొని ఆస్పత్రికి అలా పరుగెత్తాం జ్ఞాపకం ఉందా?" ఆఁ అన్నట్టు తలూపాడు కానీ, వాడి నోట మాట రాలేదు. "మరి అమ్మమ్మని..." నా మాట పూర్తిగా అవనివ్వలేదు వాడు. నాకు ఒళ్ళు మండి

# మరణం అంటే చావే

పోయింది. "అది జంతువు బాబూ, దానికి నోరు లేదు కదా. మనమే గ్రహించి చేయవలసింది చేయాలి. కానీ, అమ్మగారికి అందరూ ఉన్నారు కదా." నెమ్మదిగా అన్నాడు వాడు. "ఎందరో ఉంటే ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి టైం పడుతుందా సూరన్నా. నువ్వూ, నేనూ తీసుకెళ్ళి ఉండొచ్చు" అన్నాను. "అలా ఎలా చేస్తామయ్యా. అందరు కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, మనవలు ఉన్నారు కదా!" నాకీ గోల అర్థం కాలేదు. అందరుంటే ఇంకా త్వరగా తీసుకెళ్ళి ఉండవచ్చునని నా మనసు చెప్తోంది. దీనిలో ఏదో లిటిగేషన్ ఉందనిపించింది కూడా. అసలు అమ్మ దేనికైనా తెగించి నిర్ణయం తీసుకోగలిగినది... ఊరుకోవడం నాకింకా మింగుడు పడడం లేదు.

"గోపీ, రామ్మా మామయ్యలు వచ్చారు" అంటూ కేకేసింది అమ్మ. "అందరూ ఇలా కూర్చుంటే అమ్మమ్మ దగ్గరకెవరెడతారు. బయలుదేరరేం." అడిగా. నాకు కోపం, ఉడుకుబోత్తనం వచ్చేస్తోంది. "వదినా, నీ కొడుకు పెద్ద ఆరిందా అయ్యాడే. బాగా చదువుతున్నాడా. ఎమ్‌సెట్ రాయిస్తే?..." పెద్దత్త అడుగుతూ ఉంది అమ్మని. ఏదో పెళ్ళికో, పేరంటానికో వచ్చినట్టుందిగానీ అత్త చావుకి వచ్చినట్టు లేదా ధోరణి. "పెద్దత్తా, మీరు అమ్మమ్మని తీసుకురావడానికి ఎప్పుడు వెడతారు?" కోపంగా అడిగాను.

ఆవిడ నవ్వి, "ఏమిటిరా నీ తొందర. రావలసిన వాళ్ళందరూ రానీ. లేకుంటే ఇబ్బందిరా" అంది.

"ఇబ్బందేమిటి? ఎంతసేపుంటుంది పాపం అమ్మమ్మ, అందరూ వచ్చేదాకా-ఒక్కర్తే." నాకు ఏడుపొచ్చేసింది. అమ్మ దగ్గరకు తీసుకుంటూ, "పిచ్చి తండ్రి. అమ్మమ్మంటే ప్రాణం వాడికి" అంది. అమ్మకీ కాస్త దుఃఖంగానే ఉంది. కానీ, కూతురు కదా. కోడళ్ళ కంటే ఎక్కువ ఏడిస్తే ఏమేనా అనుకుంటారనుకుందో

చిత్రాలు: నర్సిం



ఏమో పళ్ళు గిట్ట కరుచుకుని కూర్చుంది.

“అయినా, అడపా దడపా వచ్చిపోయేదానివి నువ్వే కదా వదినా. మాదా దూరాభారం. ప్రయాణం ఏర్పాట్లు చేసుకుని బయలుదేరడమే గగనమైపోయింది. ఇప్పుడు చూడు, ‘అమ్మ సీరియస్’ అని టెలిగ్రామ్ అందినా రాలేకపోయాం” అంది. ఆ మాటల్లో ఏదో తెలియని విషయం తెలియకుండా చెప్తున్నట్టుగా అనిపించింది. నేను చిన్నవాణ్ణి కదా. నోరు మూసుకో అంటారని ఊరకున్నాను.

చిన్న మామయ్య కూతురు కడుపుతో ఉంది. “అయినా, చూడొదినా, వద్దే అన్నా వచ్చింది. వేవిళ్ళు, తల తిప్పు. దారంతా ఎంత ఇబ్బంది పడిందో” అంటూ తల నిమిరింది. “తొలి కాన్పు. ఎంత జాగ్రత్తగా ఉండాలి” అంటూ ఒకటే ఇదైపోతోంది చిన్నత్తయ్య.

“ఊళ్ళో ఉండిపోతే ఈ ఇబ్బంది ఉండేది కాదుగా” అనాలనుకొని, అమ్మ ముఖం చాలా గంభీరంగా ఉండడంతో నేను నోరు మూసుకున్నాను.

“ఇంతకీ ఆస్పత్రి నుంచి శవాన్ని తీసుకురావడానికి వెళ్ళాలి. ఎవరూ ఎంతకీ తెమలకపోతే ఎలాగ” అంది అమ్మే.

“పోనీ వదినా నేనూ, మా ఆయనా బయలుదేరుతాం. తరవాత వాళ్ళని బయలుదేరనీ. మరీ ఆలస్యం అయితే బాగుండదు. అప్పుడే చుట్టుపక్కలవాళ్ళు వచ్చి పోతున్నారు” అంది పెద్దత్తయ్య.

ఎవరికి ఏదో లక్కీ డిప్ తీసినట్టు, “ఎవరు? ఎవరు” అనుకుంటూ పెద్ద మామయ్య, పెద్దత్తయ్య బయలుదేరారు.

“అంబులెన్స్ మాట్లాడి తేవాలి కదా. ఇంకా తరవాత ఎన్ని ఏర్పాట్లు చెయ్యాలో” అంటూ వాళ్ళిద్దరూ బయలుదేరడం చూసి, “అమ్మా, నేను వెళ్ళనా?” అడిగా.

“వద్దు నాన్నా. పెద్దవాళ్ళు వెళ్ళాలి.”

మళ్ళీ పోయి కెమిస్ట్రీ చదువుకో అంటుందేమోనన్న భయంతో అక్కడి నుంచి తప్పించుకు వీధిలోకి చేరాను, చాలా కాలంగా ఉండడం అక్కడే కావడంతో. “ఏమిటో ఏవి శాశ్వతం అండీ. పట్టుమని మూడు వారాలు లేరు మంచంలో. ఈ కాలంలో తీసుకు తీసుకుపోవడం అన్నంత భయంకరమైంది ఇంకోటి లేదండీ” అని రకరకాలుగా ఇంటి దగ్గర చేరిన ఇరుగు పొరుగు అనుకుంటున్నారు. కొందరైతే గుంపులుగా చేరి గుసగుసలాడుకుంటున్నారు.

“కొడుకులు చెయ్యవలసింది. పాపం కూతురొచ్చింది. ఏం లాభమండీ. వాళ్ళొచ్చేదాకా ఏ నిర్ణయం చేయడానికీ లేదాయె. కూతురు పరాయిదే కదండీ. మనుమడిక్కడుండి చదువుకుంటున్నాడు కనక గానీ, ఆవిడా ముందు రాక పోయేదే. అందుకావిడ, “ఎన్ని చెప్పండి, ఎంత చేయండి. ప్రతి కొంపకీ పొయ్యి తప్పదన్నట్టు – గొడవలూ తప్పవు. ఎవరికేం ఇచ్చిందో ఏమో పాపం” అంది.

“ఓహో ఆలస్యం ఇందుకా” అనుకొన్నాన్నేను. పదకొండేళ్ళ కుర్ర కుంకని నాకు అనాలనిపించింది– అమ్మమ్మకేం లేదండీ! అంచేత గొడవలుండవు అనాలని. సరిలే పెద్దవాళ్ళతో నాకేం పని. అమ్మమ్మనలా ఆస్పత్రిలో ఒంటరిగా వదిలేయడం వెనక కూడా ఏదో ఉందని అర్థం అయింది. అబ్బ! ఈ పెద్దవాళ్ళ పొలిటిక్స్‌కి సమయం ఉండక్కరలే! విసుగొచ్చింది నాకు.

పెద్దత్తా, పెద్దమామయ్యా వెళ్ళాక అమ్మ, చిన్నమామయ్య బయలుదేరారు. “నేనూ వస్తానమ్మా” అని వెంటపడ్డా. “నువ్విక్కడే ఉండు. సుజాతకు డోకు వస్తే కాస్త నిమ్మకాయరసం తీసి ఇస్తుండు” అని నా కళ్ళల్లోకి చూసి చెప్పిందమ్మ. ఆ కళ్ళు ఏమిటో చెప్తున్నట్టనిపించింది నాకు. వాళ్ళు వెళ్ళిపోయారు.

సూరన్న ఇంకో ఇద్దరి సహాయంతో ముందు హాలులో ఫర్నిచరంతా డైనింగ్ హాలులోకి పట్టించాడెలాగో. దాంతో డైనింగ్‌హాలు పాత సామాన్ల వేలం హాలులా ఉంది. అయినా, నాకు గమ్మత్తుగా బాగుంది. ఏదో మార్పు. హాల్లో నెమ్మదిగా మాట్లాడినా మన గొంతు మనకే రెట్టించి వినిపిస్తోంది– ఖాళీగా ఉండడం వల్ల. అరుస్తూ ఇటూ అటూ పరుగులు పెట్టాలని ఉంది నాకు. కానీ, ఈ డోకులూ – నిమ్మకాయల రసం కేసు నా నెత్తికెక్కి కూర్చుంది. అబ్బబ్బ! అయిదు నిమిషాలకోసారి... విసుక్కుంటే అమ్మకు చెప్తుం దేమోనని భయం. ఏమిటో ఈ కడుపు గోల! ఇంత న్యూసెన్సుగా ఉంటుందని తెలియనే లేదు నాకు!

ఓ గంట ఏలాగో గడిపేశాను. “అదిగో వచ్చేస్తోంది అంబులెన్స్” అన్నాడు సూరన్న. గేటు బార్లా తీశారు. అది లోపలికి వచ్చి ఆగింది. ఒక్క పెట్టున ఏడుపులు మిన్నుముట్టాయి. ‘ఇప్పటిదాకా కబుర్లాడుతున్నారే! ఇదేం గోల? అమ్మమ్మని దింపనీయరేం’ అనుకుంటూ పక్కగా నిలబడ్డాను.

“అదుగో అటు తలుండకూడదు. ఇదిగో ఇటు కాళ్ళు ముందు రానివ్వ కూడదు” అంటూ ఒకటికి పదిమంది సలహాలిస్తున్నారు. మొత్తానికి అమ్మమ్మని దించి హాల్లో పడుకోపెట్టారు. ఇక అత్తలు, మామయ్యలు ఆమె శరీరం మీద పడి “ఎంతట్లో పోయావే అమ్మా” అంటూ గోలగోలగా ఏడవడం ప్రారంభించారు. అమ్మమ్మ కళ్ళు తెరిచి, “కాస్త గోల తగ్గిస్తారా” అని అంటుందేమో అనుకున్నాను. ప్చ్! అదేం జరగలేదుగానీ, ఆ సందట్లో సందడిగా పెద్దత్త చేతికి ఉన్న అమ్మమ్మ ఉంగరం చూసి చిన్నత్త నిటారుగా కూర్చుంది. ఏడుపు ఆగిపోయింది. కోపంతో ముక్కుపుటాలు ఎగరేస్తూ ఉంది. అప్పుడే నేనూ చూశాను. అమ్మమ్మ ఉంగరం పెద్దత్తవేలుకి. అమ్మమ్మ అది పెద్దయ్యాక నాకిస్తానంది. “ఇందుకే ముందు ఆస్పత్రికి వెళ్ళావా తల్లీ! ఇలాంటిదేదో ఉంటుందని ఊహించాను. బుద్ధులెక్కడికి పోతాయి” అంటూ పళ్ళు కొరికింది చిన్నత్త. “కాస్త నోరు మూసుకోవే! అమ్మ పోయి మేం ఏడుస్తుంటే నీ గోల ఏమిటి?” నెమ్మదిగా అన్నాడు చిన్న మామయ్య.

> ఓసారి నా కుక్క కాలు మీద సైకిల్ చక్రం ఎక్కించేశాడెవడో వెధవ! అమ్మమ్మ, “ఒరే నానీ, దాన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి కట్టు కట్టించరా. నోరు లేని జీవం” అని నన్ను తరిమింది.

“అమ్మా, అమ్మమ్మ ఉంగరం” అన్నా. ‘ష్’ అంది నన్ను దగ్గరగా లాక్కుని. “మాట్లాడకు... ఇప్పటికి జరుగుతున్నది చాలు” అంది నెమ్మదిగా. “అది నాకిస్తానందే... అత్తయ్య తీసేసుకుంది” అన్నా. మళ్ళీ “ష్” అందే కానీ అమ్మ ఏం అనలేదు. “అది తాతయ్యది. నాకిస్తానంది” కాస్త గట్టిగా అన్నా. “తప్పు నాన్నా నువ్వెళ్ళు. ఇంకా చాలా తతంగం ఉంటుంది. పోయి పెరట్లో కెమిస్ట్రీ...” అంటుండగానే నేను దూరంగా పారిపోయా. నా కర్మ! ఈ కెమిస్ట్రీ నా ప్రాణం మీదికి వచ్చింది. నన్నేం చూడనివ్వదు. విననివ్వదు. అదే చెప్పొగా– ఇంట్లోవి వినడానికీ, చూడడానికీ చిన్న వెధవని. చదువుకి పెద్ద వెధవని! బ్రాహ్మలు వచ్చారు. ఏర్పాట్లేవో చేస్తున్నారు. అమ్మమ్మ మటుకు హాయిగా పడుకునే ఉంది. ఎవరో ఒకరు రావడం, అత్తలు ఓ అంటూ గుండెలు అవిసేలా ఓ ఏడుపు ప్రారంభించడం, ఆగడం – ఇలా జరుగుతూనే ఉంది. మధ్యమధ్యలో కాఫీలు, ఫలహారాలు, నిమ్మ రసాలు అన్నీ సాగిపోతూనే ఉన్నాయి.



"అమ్మ ఏమైనా చెప్పిందా వదినా!" ఎంతో అమాయకంగా అడిగింది పెద్దత్తయ్య. మామయ్య కూడా వెనకే ఉన్నాడు. "ఏం చెప్పలేదు. బీరువా తాళాలు కూడా సూరన్న దగ్గర ఉన్నాయి. నా దగ్గర లేవు" అంది అమ్మ. అమ్మకి వాళ్ళలా అడిగినందుకు కాస్త బాధ అనిపించింది కాబోలు. గొంతు వింటే నాకలా అనిపించింది. "అయ్యో! పనివాడికి తాళాలివ్వడం ఏమిటి?" ఇద్దరూ ఒక్కసారే అన్నారు. "వాడు మంచివాడు. వాడికి అమ్మమ్మంటే ఇష్టం" అన్నా. "నీకేం తెలియదు గోపీ. పోయి... అనేలోగా నేను సూరన్న కోసం పరుగెత్తా. "అన్నీ ముందరే సర్దుకొని ఉంటుంది. అందుకే అంత గుంభనంగా ఉంది." పైకి అంటున్న అన్నల భార్యలని అన్నలు ఏమీ అనకపోవడం చూసి నాకే ఒళ్ళు మండింది.

అమ్మా" అన్నా. "ఊరుకో" అన్నట్టు కళ్ళతోనే చెప్పింది. "అయినా, మీరేం తక్కువ తిన్నారా" అంటూ పెద్దత్తయ్య చేతి వేలు అందుకుంది చిన్నత్త. పెద్దత్తయ్య చేయి లాక్కుంది. చిన్న మామయ్య పెళ్ళాన్ని పిలిచి, "అందుకనే అప్పుడే చెప్పా, పీక్కుని వేలుకి తగుల్చుకోకే అని, తరువాత అఘోరించకూడదాని. ఇప్పుడు చూడు" అని వినబడకుండా కసిరాడు.

"ఏదో త్వరగా కానివ్వండి. పిల్లా పాపలతో ఉన్న వాళ్ళం. ఎవరింటా పొయ్యి అంటించలేదండీ" అని హెచ్చరించిందో పెద్దావిడ. బ్రాహ్మలు తొందర చేశారో ఏమో! వాళ్ళకు చీకటి పడేలోగా ఇంకో గిరాకీ తగొలొచ్చు కదా. "అమ్మమ్మనేం చేస్తారు" అని నాలో నేను అనుకున్నాను. గోల ఉద్ధృతం హెచ్చింది. ఇక చివరి ఘడియలు వచ్చేసరికి అత్తల ఏడుపు ఆకాశాన్నంటింది. అమ్మ కొంగు నోటికడ్డుపెట్టుకొని కూర్చుందో మూల. ఇంకో మూల ఈ గోలంతా చూస్తూ అమ్మమ్మ కూడా ఉందేమో. 'ఉంటే బాగుండేది' అనుకున్నా. కడుపావిడ ఓ గావుకేక వేసింది. కర్మ! పరిస్థితి నిమ్మరసం దాటిందేమో. "అయ్యో, నొప్పులు మొదలు కాలేదు కదా. ఎవరేనా అమ్మాయిని చూడండి" అంటూ కర్మకాండ ఫాస్ట్ ఫార్వర్డ్‌లో సాగించేసి, అమ్మమ్మని అమాంతం నల్గురు భుజాన ఎత్తుకుని బయలు దేరారు. మగాళ్ళు వెంట వెళ్ళారు.

ఇరుగు పొరుగులు, "అదృష్టవంతురాలు. కొడుకులు, కోడళ్ళు, కూతురు అంతా రాగల్గారు" అనుకుంటూ స్నానాలు చేసి, ఇంత వండుకు తిండానికి కాబోలు గబగబ ఎవరి దారిన వారు పోయారు.

ఆడాళ్ళుండిపోయారు. కీచులాటలు, దెబ్బలాటలుగా మారుతున్నాయి క్రమేపీ. నేను అమ్మ దగ్గరకి వెళ్ళలేదు. 'పోయి కెమిస్ట్రీ చదువుకో' అంటుందని.

సూరన్నతో పెరట్లోకి పోయి కూర్చున్నా.

"సూరన్నా చావంటే ఇలాగే ఉంటుందా" అనడిగా. ఇది చాలా అసహ్యంగా ఉందనిపించింది. "తప్పు బాబూ, పెద్దమ్మగారు మరణించారనాలి" అన్నాడు వాడు కళ్ళొత్తుకుంటూ. నాకు నవ్వొచ్చింది. అమ్మమ్మ గురించి ఎవరూ మాట్లాడనే లేదు. ఆమె చావు గురించి కీచులాడుకున్నారు. అత్తయ్యలు, మామయ్యలు, చుట్టాలు - అంతా చావు గురించే కదా మాట్లాడుత!

"మరణం అంటే చావే కదా సూరన్నా" అన్నా. వాడు అవునన్నట్టు తలూపాడు, "చిన్నాడివి. నీకేం తెలుసులే" అంటూ. ■